క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు సరుకులు అందజేస్తున్న నాయకులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన అగ్నిప్రమాద బాధితులకు నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్ నల్లి కృష్ణవేణి, నాయకులు తుమ్ము నారాయణమూర్తి, పాండ్రంకి సత్యనారాయణ, నల్లి శ్రీను, మద్దిల వాసు, మాత సంధ్య, తదితరులు సోమవారం సాయమందించారు. ఈనెల 28న జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన కొండల పద్మావతి కుటుంబీకులను పరామర్శించి, గ్యాస్‌స్టవ్, వంట సరుకులు, ఇతర నిత్యావసరాలు, దుస్తులు అందజేశారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయాన్ని త్వరగా వచ్చేలా చూస్తామని రామారావు హామీ ఇచ్చారు.

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న త్రినాథస్వామి, తదితరులు

విజయనగరం ఫోర్ట్: జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రూపొందించిన డైరీని జిల్లా వ్యవసాయ అధికారి కె. త్రినాథస్వామి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు పి. జగన్నాథరావు, కార్యదర్శి పి. కూర్మారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టి. తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్‌కు సంక్రాంతి పురస్కారం



దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన సాధనా యువజన సంఘ అధ్యక్షుడు, రక్తదాత పోలుబోతు దుర్గాప్రసాద్‌కు సంక్రాంతి జాతీయ పురస్కారం లభించింది. సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నందుకు, అలాగే ఇప్పటి వరకు 57 సార్లు రక్తదానం చేసినందుకు గుర్తింపుగా వరంగల్‌కు చెందిన కన్నతల్లి ఫౌండేషన్ వారు ఈ అవార్డును సోమవారం బహూకరించారు. అవార్డు అందుకున్న దుర్గాప్రసాద్‌ను సాధన సంస్థ ఉపాధ్యక్షుడు బెల్లాన వెంకటరావు, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, స్థానిక పెద్దలు అభినందించారు.

భజరంగ్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్‌లు

విజయనగరం: ఇటీవల ఒంగోలులు నిర్వహించిన 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరంలోని భజరంగ్ అకాడమీ విద్యార్థులు పలు పతకాలు సాధించారని శిక్షకులు పి.అశ్విని, ఎం.మధు, గాంధీ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ, అండర్ – 17, 56 కిలోల విభాగంలో పి.పార్వతి బంగారు పతకం, 78 కిలోల విభాగంలో ఎం.హేమంత్ రజత పతకం, అండర్– 14, 50 కిలోల విభాగంలో టి.సాయి రామ్‌చరణ్ కాంస్య పతకం సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కోచ్‌ను చీఫ్ కోచ్ పి.తాతారావు అభినందించారు.

నేడు కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం

విజయనగరం: రాబోయే ఆర్థిక సంవత్సరంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఆదాయ, వ్యయాల నిర్వహణపై బడ్జెట్ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో జరగనున్న సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

• డీసీసీ అధ్యక్షుడు రమేష్‌కుమార్



విజయనగరం ఫోర్ట్: గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రమేష్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు సరగడం రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక డీసీసీ కార్యాలయం ఆవరణలో జాతిపిత గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్‌కుమార్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యాన్ని అహింసా మార్గంలో సాధించిన గాంధీజీ మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుంకరి సతీష్, డోల శ్రీనివాస్, జమ్ము ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆధ్వర్యంలో..

విజయనగరం లీగల్: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి న్యాయవాదుల సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు బండారు సంజీవరావు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి వై. హరికృష్ణ, కోశాధికారి కె.అప్పారావునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఆవరణలో..

విజయనగరం అర్బన్: కలెక్టరేట్ ఆవరణలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు రొతు భాస్కరరెడ్డి, అవనాపు లక్ష్మణరావు, గొంప అప్పలరాజు, జానా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం లీగల్: మహాత్ముడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



విజయనగరం అర్బన్: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు

ఉపాధి పనులపై ప్రజావేదిక



ప్రజావేదికలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న ప్రిసైడింగ్ అధికారి ఎస్.జనార్దనరావు

భోగాపురం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన ప్రిసైడింగ్ అధికారి ఎస్.జనార్దనరావు ఆధ్వర్యంలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ సభ్యులు మాట్లాడుతూ, 2021 – 22 సంవత్సరానికి గాను రూ.14.20 కోట్ల వేతనానికి, రూ.1.82 కోట్ల మెటీరియల్‌కు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా వేతనదారుల మస్టర్లలో చిన్న చిన్న పొరపాట్లు చోటుచేసుకున్నాయని.. పనులకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయలేదని చెప్పారు. చాకివలస పంచాయతీలో ఏడాది కిందట చనిపోయిన నలుగురు వృద్ధుల పేర్లను పింఛన్ జాబితాల నుంచి తొలగించలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఏపీడీ వీవీడీఎస్ లక్ష్మణ్, డీఆర్‌ఓ ఎస్.రవీంద్ర, ఎస్ఆర్‌పీ సీహెచ్.సత్యనారాయణ, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఏపీఓ ఎం.ఆదిబాబు, గ్రామ సర్పంచ్‌లు, జేఈ, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు



అధికారుల సమక్షంలో ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారు

విజయనగరం టౌన్: జగనన్న కాలనీ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ కార్పొరేషన్ డీఈ జీవీ రంగారావు అన్నారు. ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం మేడపైనున్న 34వ డివిజన్ 41వ సచివాలయంలో గృహనిర్మాణ లబ్ధిదారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అతిపెద్ద లేఅవుట్‌గా పేరుగాంచిన గుంకలాం లేఅవుట్‌లో లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంట్‌తో పాటు ఇంటి సామాగ్రి కూడా అందుబాటులో ఉందన్నారు. విద్యుత్, నీటి సౌకర్యంతో పాటు బిల్లులు కూడా వెంటవెంటనే చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ, మౌలిక వసతులు కల్పిస్తుండడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, కార్పొరేటర్ బాలి పైడిరాజు, బాలి ప్రతాప్, ఎమినిటీస్ సెక్రటరీ బి.శ్రీనివాస్, సారిక సతీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



డిపో ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు

విజయనగరం టౌన్: రహదారి ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని డిపో అసిస్టెంట్ మేనేజర్ బి. ఆదినారాయణ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న డిపో వద్ద సోమవారం సాయంత్రం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా డ్రైవర్లు తమ విధులను నిర్వహించాలన్నారు. తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం డ్రైవర్లతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, యూనియన్ ప్రతినిధులు, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

జొన్నాడ పైడితల్లి జాతర ప్రారంభం



పైడితల్లి అమ్మవారు

డెంకాడ: జొన్నాడ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున బందోబస్తు నిర్వహించేందుకు పోలీసులు చేరుకున్నారు. విజయనగరం – విశాఖ జాతీయ రహదారికి ఆనుకుని అమ్మవారి గుడి ఉండడంతో ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి భోగాపురం సీఐ విజయ్‌నాథ్, ఎస్సై మహేష్ సూచనలు చేశారు.



బందోబస్తుకు చేరుకున్న పోలీస్ సిబ్బంది

ఇన్సూరెన్స్‌లో రంగంలో ఎల్‌ఐసీదే అగ్రస్థానం

విజయనగరం టౌన్: ఇన్సూరెన్స్ రంగంలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ)దే అగ్రస్థానమని సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్. నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదానీ గ్రూప్ కంపెనీ షేర్లు పడిపోవడం వల్ల ఎల్‌ఐసీ నష్టపోయినట్లు సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు పూర్తిగా అవాస్తవమన్నారు. పాలసీదారులు ఎటువంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎల్‌ఐసీ నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తులు 2022 సెప్టెంబర్ 30 నాటికి 41.66 లక్షల కోట్ల రూపాయలని చెప్పారు. ఎల్‌ఐసీ 66 ఏళ్ల స్థిరమైన సంస్థ అని, సావరిన్ గ్యారెంటీ ఉందని స్పష్టం చేశారు.

సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే పూర్తి చేయండి

నెల్లిమర్ల: నగర పంచాయతీలో సిటిజన్ ఔట్‌రీచ్ సర్వేను ఈ నెల 31లోగా పూర్తిచేయాలని కమిషనర్ పి. బాలాజీప్రసాద్ ఆదేశించారు. పట్టణ పరిధిలోని అగురువీధి, గాంధీనగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. సచివాలయాల ద్వారా ప్రజలు పొందుతున్న సేవల వివరాలను తెలుసుకోవడానికే సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణవాసులు సహకరించాలని సూచించారు. వలంటీర్లు నేటి సాయంత్రంలోగా సర్వేను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించండి


విజయనగరం ఫోర్ట్: ఆరోగ్య నియమాలపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని గ్రామీణ వైద్యుల సంఘ జోనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి పిలుపునిచ్చారు. విశాఖపట్నం జిల్లా గోపాలపట్నంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆరు జిల్లాల గ్రామీణ వైద్యుల సంఘ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా గద్దె చిరంజీవి ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వి. గౌరినాయుడు, రామ్మూర్తి రాజు, ముత్యాలరావు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

భోగాపురం: మండలంలోని కారిగొల్లపేట గ్రామానికి చెందిన బమ్మిడి తాతారావును ఆటోతో ఢీకొన్న గొలగాని సూర్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. ఈ నెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో తాతారావు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుడి భార్య రమణమ్మ సోమవారం ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్నిరకాల వ్యాధులకు శస్త్రచికిత్సలు

• ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రొఫెసర్ పీపీ రమణి



విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జనరల్ సర్జరీ విభాగానికి సంబంధించి అన్ని వ్యాధులకూ శస్త్రచికిత్సలు చేస్తున్నామని జనరల్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పీపీ రమణి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఆస్పత్రిలో 88 పడకలు జనరల్ విభాగానికి కేటాయించామని చెప్పారు. బర్నింగ్, ఇన్‌ఫెక్షన్ , హైడ్రోసెల్, హెర్నియా, అపెండసైటిస్, కడుపులో పేగుకు కన్నం పడడం, పేగు కుళ్లిపోవడం, తదితర వ్యాధులకు చికిత్స అందిస్తున్నామని తెలిపారు. అవసరమైన రోగులకు ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. ల్యాప్రోస్కోప్ ద్వారా రోగులకు ఆపరేషన్‌లు చేస్తున్నామన్నారు.

నేడు పెదవేమలిలో వైద్యశిబిరం

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో హీలింగ్ హ్యూమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆటో స్టాండ్ వద్ద మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు ఇమ్మానుయేలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో బీపీ, ఈసీజీ, రక్త, తదితర వైద్య పరీక్షలను డాక్టర్ సీహెచ్.వేణుగోపాలరెడ్డి చేస్తారని పేర్కొన్నారు.

ఫుడ్ బ్యాంక్‌లతో అన్నార్తులకు ఆసరా..

• ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు



అన్నార్తులకు ఆహారం వడ్డిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

విజయనగరం: నగరంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌బ్యాంక్‌లు అన్నార్తులకు ఆసరాగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. ఆయన కుటుంబ సభ్యుడైన దివంగత ఎన్‌వీ రమణరాజు జయంతిని పురస్కరించుకుని నగరంలోని నాలుగు ఫుడ్ బ్యాంకుల ద్వారా అన్నార్తులకు ఆహారం పంపిణీ చేశారు. ఆయనే స్వయంగా పేదలకు అన్నం వడ్డించారు. కోట, ఎన్‌సీఎస్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, పోలీస్ బ్యారెక్స్ వద్దనున్న ఫుడ్ బ్యాంకులకు వెళ్లి పేదలకు ఆహారం సమకూర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో నాలుగు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిరంతరం ఆహారాన్ని సమకూర్చేందుకు వివిధ స్వచ్ఛంద సంస్థలకు నిర్వహణ బాధ్యతను అప్పగించడం గొప్ప ఆలోచనగా పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పండగలు, శుభకార్యాలు, ప్రత్యేక రోజుల్లో పేదలకు ఆహారం సమకూరుస్తుండడం అభినందనీయమన్నారు. జిల్లా కేంద్రానికి నిత్యం వేలాది మంది ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారని, అటువారికి ఈ ఫుడ్‌బ్యాంక్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘ రాష్ట్ర ప్రతినిధి ఇప్పిలి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, చెక్ అందజేస్తున్న ఝాన్సీలక్ష్మి, తదితరులు

• మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం టౌన్: పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. తోటపాలెం సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో బొత్స గురునాయుడు, మజ్జి రామారావు జ్ఞాపకార్థం కళాశాలలో మెరిట్ విద్యార్థులకు సోమవారం అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, విద్యలో రాణిస్తున్న వారికి మెరిట్ అవార్డులను ప్రతి ఏటా అందజేస్తున్నామన్నారు. ప్రతి తరగతి నుంచి టాపర్లను తీసుకుని వారికి సర్టిఫికెట్, షీల్డ్, రూ. 5 వేల నగదు బహుమతి అందజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ, విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులను గౌరవిస్తూ చక్కగా చూసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మజ్జి అనురాధ, భార్గవ్ భూషణ్, పూజిత, కేసలి అప్పారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, ఎన్‌సీసీ కెప్టెన్ మీసాల సత్యవేణి, ఎం.ఉదయ్ కిరణ్, బి.సూరప్పనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులపై కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యంగా 14వ ఆర్థిక సంఘం నిధులు పనులు ఏ మేరకు చేరుకున్నాయి.. మిగిలి ఉన్న పనులు ఎన్ని.. వాటి ప్రగతిపై ఆరా తీశారు. త్వరితగతిన పనులు పూర్తయ్యే విధంగా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఈఈ కె. శ్రీనివాసరావు, ఏఈలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజారోగ్య విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. యూజర్ చార్జీలు, ఇంటింటి చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధం అమలు వంటి అంశాలపై చర్చించారు. మెరుగైన పారిశుధ్య విధానానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ప్రజారోగ్య అధికారి సత్యనారాయణ, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

హర్షాతిరేకాలు




ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఫొటోల వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముందస్తుగా ప్రకటించిన విధంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంపై నగరంలోని 12వ డివిజన్‌కు చెంది మహిళలు హర్షం వ్యక్తం చేశారు. జగనన్న చేదోడు పథకంలో భాగంగా రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీలకు సోమవారం నగదు జమ చేశారు. దీంతో ఆయా లబ్ధిదారులు థ్యాంక్యూ సీఎం సార్, థ్యాంక్యూ ఎమ్మెల్యే సార్ అంటూ వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో 12వ డివిజన్ కార్పొరేటర్ రేగాన రూపాదేవి, జగనన్న సచివాలయ కన్వీనర్లు డొంకాడ పద్మావతి, భానుమూర్తి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మధుసూదనరావు, సచివాలయ సిబ్బంది, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

● సై అంటే సై..







మందలోని మేకలు, గొర్రెలు ఎప్పుడూ కలసిమెలిసి ఒక క్రమపద్ధతిలో స్నేహితుల్లా వెళ్తుండడం మనం చూస్తుంటాం. కాని అప్పుడప్పుడు వాటిలో అవి కలహించుకుంటుంటాయి. ఆ సమయంలో సై అంటే సై అన్నట్లు తలపడుతుంటాయి. జిల్లా కేంద్ర సమీపంలో రెండు మేకలు తలపడడం సోమవారం సాక్షి కంటపడ్డాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం